క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు: ములుగు సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సాయికృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్–1 పరిధిలోని కలెక్టర్ కార్యాలయం, కృష్ణాకాలనీ, గట్టమ్మ వరకు సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

4న నైతికత మానవ విలువలపై పరీక్ష

ఏటూరునాగారం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 4న నైతికత మానవ విలువలు, పర్యావరణ విద్య వార్షిక పరీక్షలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భగవద్గీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థినీ విద్యార్థులకు ఈనెల 4న నైతికత మానవ విలువలు, 6న పర్యావరణ విద్యపై పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందన్నారు. గతంలో ఈ పరీక్షలు రాయకపోతే మళ్లీ రాయవచ్చని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



ఎస్ఎస్‌తాడ్వాయి : సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంలాటిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దంగుల మల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని కాటాపూర్‌కు చెందిన కుసుమ వెంకటేశ్వర్లుకు మంజూరైన రూ.లక్ష సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు దిలార్‌ఖాన్, మాజీ మండల అధ్యక్షుడు ముంద్రతి రాజశ్రీ, బండారి చంద్రయ్య, దిడ్డి మోహన్‌రావు, తాడ్వాయి ఉపసర్పంచ్ ఆలేటి ఇంద్రారెడ్డి, మాజీ మండల ప్రధానకార్యదర్శి సయ్యద్ వహిద్ హుస్సేన్, కాటాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు, రంగు సత్యనారాయణ, నియోజక వర్గ యువజన విభాగం ఉపాధ్యక్షుడు సలెందర్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నేడు జీసీసీ సొసైటీ పాలకమండలి సమావేశం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) సొసైటీ పాలక మండలి సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు జీసీసీ మేనేజర్ దేవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీసీసీ ద్వారా అమలవుతున్న పథకాలు, సొసైటీ అభివృద్ధిపై చర్చించడం జరుగుతుందన్నారు. సభ్యులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

సాంకేతిక లోపంతో నిలిచిన బస్సు



వెంకటాపురం(కె): వెంకటాపురం నుంచి వరంగల్ వైపు వెళ్లే హన్మకొండ బస్సు ఇంజన్‌లో లోపం వల్ల నూగూరు వద్ద బుధవారం బస్సు నిలిచిపోయింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారాన్ని వరంగల్– 2 డిపో బస్సు సిబ్బంది అధికారులకు సమాచారం అందజేశారు. అనంతరం ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో వెళ్లిపోయారు.

ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే సన్మానం



ములుగు రూరల్ : వరంగల్ ప్రెస్‌క్లబ్ సభ్యులను ములుగు ఎమ్మెల్యే సీతక్క సన్మానించారు. బుధవారం మండలంలోని జాకారం పంచాయతీ పరిధి గట్టమ్మ ఆలయం వద్ద నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ సభ్యులను శాలువాలతో సన్మానించారు. ముందుగా గట్టమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం మేడారం వనదేవతల దర్శనానికి బయలుదేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, ఆకుతోట చంద్రమౌళి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మహదేవపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై ఎస్సై భవానిసేన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ చెప్పవద్దని, మోసపూరిత సందేశం నమ్మి గుర్తుతెలియని వ్యక్తులకు ఆధార్, బ్యాంకు, వివరాలు తెలియజేయద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కి కాల్ చేయాలని సూచించారు.కార్యక్రమంలో పోలీసులు, హెచ్‌ఎం ఆకుల అశోక్, ఉపాధ్యాయులు, సీఆర్పీఎఫ్ పోలీసులు, పాల్గొన్నారు.

పన్నుల వసూలు పూర్తిచేయాలి

● మండల స్పెషలాఫీసర్ తుల రవి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మంగపేట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 4 వరకు అన్ని రకాల పన్నుల వసూలు 100 శాతం పూర్తి చేయాలని మండల స్పెషలాఫీసర్ తుల రవి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తెలంగాణ క్రీడాప్రాంగణాలు పూర్తి చేయాలని ఈజీఎస్ ఏపీఓ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. గ్రామీణ నర్సరీల పనులను పూర్తిచేయాలని కార్యదర్శులకు సూచించారు. సమావేశానికి ముందు మండల స్పెషలాఫీసర్ తుల రవి, మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ బ్రాహ్మణపల్లి గిరిజన బాలుర ఆశ్రమపాఠశాల, రాజుపేట, తిమ్మంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. మల్లూరు, మంగపేటలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీఓ చరణ్‌రాజ్, పీఆర్ ఏఈఈ వాసుదేవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ యాకన్న, ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ రమేష్, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

వెంకటాపురం(కె): అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట బుధవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సంఘం జిల్లా నాయకురాలు ప్రేమకుమారి మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం ద్వారా ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసి అంగన్‌వాడీ ఉద్యోగుల ఉపాధికి నష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు సడాలు, రత్నకుమారి, స్వరూప, సరిత, విజయ, నిర్మల, పుష్పలత, పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

మంగపేట: ఈనెల 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న అగ్రిగోల్డ్ బాధితుల మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం మండల అధ్యక్షురాలు కోడం ప్రభావతి బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా బాధితులు 5 లక్షల మందికి పైగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో రూ 500 కోట్ల డిపాజిట్లు ఉంటే రాష్ట్రంలో అగ్రిగోల్డ్ సంస్థల ఆస్తుల విలువ సుమారు రూ.1000 కోట్లకు పైగా ఉంటుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెల్లిస్తున్న విధంగా తెలంగాణ ప్రభుత్వం సంస్థ ఆస్తులను స్వాధీనం చేసుకుని బాధితులకు డబ్బులు చెల్లించాలనే డిమాండ్‌తో బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి బాధితులు, ఏజెంట్లు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కుమారస్వామి మృతి పార్టీకి తీరని లోటు



కుమారస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

ములుగు రూరల్(గోవిందరావుపేట): కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు నల్లెల్ల కుమారస్వామి మృతి పార్టీకి తీరని లోటు అని గోవిదంరావుపేట కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పడిగ పార్వతి అన్నారు.బుధవారం మండలకేంద్రంలో కుమారస్వామి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 30 ఏళ్ల రాజకీయ జీవితం ప్రజల మధ్య గడిపి ప్రజల మనసుగెలిచిన నాయకుడని అన్నారు. ఆమె వెంట మహిళా నాయకురాలు కొమురం ధనలక్ష్మీ, పాలడుగు వెంకటక్రిష్ణ, సోమయ్య, శ్రీకాంత్, ఏడుకొండలు, లక్ష్మీ–జోగనాయక్, కృష్ణ, చంద్రశేఖర్, కల్యాణి, సృజన, వజ్రమ్మ, ప్రమీల, రజిని, జయమ్మ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలి

ములుగు రూరల్ : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ భూక్య దేవ్‌సింగ్ అన్నారు. మండలంలోని బండారుపల్లి మోడల్ కళాశాల, గోవిందరావుపేట మండలంలోని చల్వాయి మోడల్ కళాశాల విద్యార్థులకు ఎంసెట్, నీట్ స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్మీడియట్ అనంతరం చదువులో తీసుకునే నిర్ణయాలపై భవిష్యత్ ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రిన్సిపాల్ ఎస్. శోభారాణి మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు ఎంట్రెన్స్ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్ అందించినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమనుషులపై కేసు నమోదు

ములుగు రూరల్ : మండలంలోని బంజరుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ సంబంధం విషయంలో పంచాయితీ చేపట్టిన పెద్ద మనుషులపై కేసు నమోదైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బంజరుపల్లికి చెందిన జె.గంగాధర్ గ్రామంలోని మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడని మహిళ భర్త పెద్ద మనుషులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో పెద్దమనుషులు పంచాయితీ నిర్వహించగా తాను ఎలాంటి తప్పు చేయలేదని గంగాధర్ చెప్పినా పెద్దమనుషులు పట్టించుకోలేదు. దీంతో ఇరువర్గాల పెద్ద మనుషులు తప్పు చేయలేదని నిర్ధారించేందుకు ఆటవిక చర్యకు తెరలేపారు. తప్పుచేయని వాడివైతే నిప్పుల్లో కాల్చిన గడ్డపారను తీయాలని నిర్ణయించారు. పెద్ద మనుషులు గోవిందరావుపేట మండలం లక్నవరం సమీపంలో గుట్టు చప్పుడు కాకుండా తతంగం నడిపించారు. పెద్దల నిర్ణయం మేరకు గంగాధర్ వేడి చేసిన గడ్డపారను చేతులతో తీశాడు. అయినప్పటికీ పెద్ద మనుషులు గంగాధర్‌ను తప్పు ఒప్పుకోవాలని బెదిరింపులకు పాల్పడడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నాగయ్యతో పాటు ఇరువర్గాల పెద్ద మనుషులు కుంభం రాములు, సుంకయ్య, రాజయ్య, సాంబయ్య, దాసరి గంగయ్య, సమ్మయ్య, రాజయ్య, అనుము సమ్మయ్యలపై ఐపీసీ సెక్షన్ 336/ 149 ప్రకారం కేసు నమోదు చేస్తున్నట్లు రెండో ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

సమ్మయ్యనాయక్‌కు డాక్టరేట్

భూపాలపల్లి రూరల్: చిట్యాల మండలం గిద్దముత్తారం గ్రామానికి చెందిన శీలోతు సమ్మయ్య నాయక్ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్శిటీ హైద్రాబాద్ (జేఎన్‌టీయూ)లో కంప్యూటర్ సైన్స్‌అండ్ ఇంజనీరింగ్ విభాగంలో గౌరవ డాక్టరేట్ పీహెచ్‌డీ పట్టా పొందాడు. సమ్మయ్య 1 వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పరకాలలోని శ్రీచైతన్య మోడల్ స్కూల్లో చదివాడు. ఇంటర్మీడియట్ హన్మకొండలోని ఎస్ఎన్ కళాశాలలో, బీటెక్ కాయతీయ యూనివర్శిటీలో పూర్తి చేశాడు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్శిటీల్లో ఎంటెక్ పూర్తి చేసి అదే యూనివర్శిటీలో ప్రొఫెసర్ డాక్టర్ గోపాల్ ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరు విభాగంలో పరిశోధన చేశారు. బుధవారం ప్రొఫెసర్ గోపాల్ చేతులమీదుగా పీహెచ్‌డీ పట్టా పొందారు. కౌన్సిలర్లు పానుగంటి హారిక, బానోత్ రజిత, సమ్మయ్య నాయక్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

ఎస్సారెస్పీ ద్వారా నీటిని విడుదల చేయాలి



మాట్లాడుతున్న రైతులు

చిట్యాల: ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు డీబీఎం 38 ద్వారా ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని మండలకేంద్రానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్ర శివారులో డీబీఎం–38 కెనాల్ వద్ద నీటిని విడుదల చేయాలని రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో నీటి వినియోగం తక్కువ ఉందన్నారు. సాగు చేస్తున్న మొక్కజొన్న మిరప పంటలు ఎండిపోతు న్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు ఎస్సారెస్పీ డీబీఎం 38 కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పిట్టల రమేష్, సాదుల రవీందర్, అల్లం రవీందర్, ఈగ రాములు, రాయకొమురు, భద్రయ్య, దిలీప్, పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జీఎం కార్యాలయ మహిళ ఉద్యోగులకు నిర్వహించిన క్రీడాపోటీలను ఫైనాన్స్ మేనేజర్ సురేఖ ప్రారంభించారు. స్థానిక మైన్స్, రెస్క్యూ స్టేషన్ ఆవరణలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. అధికార ప్రతినిధి తుకారాం, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

అగ్గితెగులుపై అప్రమత్తత అవసరం



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాస్

టేకుమట్ల: వరి పంటలో అగ్గితెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కలికోట శివారులో వరి పంటలను పరిశీలించారు. వరి పంటలో అగ్గి తెగులును గుర్తించి రైతులకు నివారణపై పలు సలహాలు, సూచలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొలం గట్లపై గడ్డి లేకుండా చూసుకుని, చిరుపొట్ట దశలో ఉన్న వరి పంటలో ఆఖరిదఫా నత్రజని వాడకం కొన్ని రోజులపాటు నిలిపి వేయాలన్నారు. అలాగే మొక్కలలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎకరాకు 13 కిలోలు ఆఖరి దఫాగా వేయాలన్నారు. అగ్గితెగులు నివారణకు ఐసోప్రొథయోలేన్, కాసుగామైసిన్, ట్రైసైక్లోపోజల్, మాంకోజెబ్‌ను తగు మోతాదులో పిచికారి చేయాలన్నారు.

మొక్కలను సంరక్షించాలి

మహదేవపూర్: నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండలంలోని కుదురుపల్లి, ఎడపల్లి గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీ టార్గెట్ మేరకు 100 శాతం మొక్కలు పెంచే విధంగా గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.ప్రస్తుతం ఎండలు తీవ్రమవుతున్నందున మొక్కలపై షెడ్‌నెట్ ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

బస్సుసౌకర్యం కల్పించాలి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మల్హర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని తాడిచర్ల–పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి మానేరుమీదుగా తాడిచర్లకు ఆర్టీసీ బస్సు సౌకర్యం నడిపించాలని మంథని డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు కాంగ్రెస్ యూత్ నాయకులు బబ్బిలి రాజు, ఆర్ని ఉదయ్ బుధవారం వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం కొయ్యూరు నాగులమ్మ మీదుగా తాడిచర్ల వస్తుందని చెప్పారు. నూతనంగా ఏర్పాటైన వంతెన మీదుగా బస్సు నడపడంతో భారం తగ్గి ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



హారిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న పుట్ట మధు

మల్హర్ : మండలంలోని వల్లెకుంటకు చెందిన హారిక, శేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూ తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కాళేశ్వర దేవస్థాన చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు తాజొద్దీన్, మండల మహిళ అధ్యక్షురాలు పంతకాని చంద్రకళ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సిద్ది లింగమూర్తి, మండల కోఆప్షన్ సభ్యుడు అయూబ్‌ఖాన్, మండల నాయకులు ఉన్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉంటాం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

ములుగు : ఇచ్చిన హామీ మేరకు ములుగు అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీ, బృందావన కాలనీల్లో సీసీ రోడ్డు పనులను ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ. 2 కోట్లతో జిల్లా కేంద్రంలో అవసరం ఉన్న ప్రతి కాలనీలో సీసీ రోడ్డు వేస్తామని అన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌మీర్జా, ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు యూనుస్, బీఆర్ఎస్ నాయకులు మేరుగు సంతోష్, అజయ్, అక్రం, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తిగా ఉద్యమించాలి



అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఏటూరునాగారం : మాదిగల అమరవీరులను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో ఉద్యమించాలని మహాజన సోషలిస్టు పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వావిలాల స్వామి అన్నారు. బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట అమరవీరుల చిత్రపటాలకు నాయకులు పూలమాల వేసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం సర్పంచ్‌లు ఈసం రామ్మూర్తి, చింత నర్సక్కచంద్రయ్య అమరవీరుల చిత్ర పటాలకు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వావిలాల సాంబశివరావు, ఎమ్మెస్పీ మండల ఇన్‌చార్జ్ వావిలాల పోశయ్య, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వావిలాల నరసింహారావు, ఆదివాసీ సంఘాల నాయకులు ఈసం యాదయ్య,చిట్యాల అరుణ్ కుమార్, పొడెం శోభన్, ముత్తయ్య, సురేష్, రమేష్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మూల్యాంకన పత్రాల పరిశీలన



మార్కుల పత్రాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

వెంకటాపురం(కె): మండలంలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థుల అంతర్గత మూల్యాంకన పత్రాలను బుధవారం డీఈఓ ఆదేశాల మేరకు ఇంటర్నల్ మార్కుల పరిశీలన బృందం పరిశీలించింది. మండల పరిధిలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల, కస్తూర్బాగాంధీ, భారతి విద్యానికేతన్ పాఠశాలల్లో విద్యార్థుల అంతర్గత మూల్యాంకన, ప్రగతి పత్రాలను పరిశీలించారు. ఇంటర్నల్ మార్కుల పరిశీలన బృందం టీంలీడర్ బొల్లే శ్రీనివాస్ మాట్లాడుతూ మూడురోజుల పాటు మండలంలోని విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేష నర్సింహారావు, జమరామ్ తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవి

మంగపేట: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషలాఫీసర్ తుల రవి అన్నారు. మండలంలోని రాజుపేట జీపీ కార్యాలయంలో బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. కంటి చూపు సమస్యలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటిఅద్దాలను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర, మాజీ సర్పంచ్ చందర్లపాటి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఎడ్లపెల్లి నర్సింహారావు, ముఖర్జీ, సాంబశివరావు, పోలిన హరిబాబు, కర్రి శ్యాంబాబు, రాజారత్నం, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకునేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న సట్ల రవిగౌడ్

టేకుమట్ల : ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేసి, ప్రజల మెప్పును పొందే నాయకులే చరిత్రకారులుగా మిగిలిపోతారన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంగి రవి, రామారావు, మహిపాల్‌రెడ్డి, స్వామి రావు, శ్రీను, మహేష్, మహేందర్, పాల్గొన్నారు.

న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తాం



పూసుకుపల్లిలో ఇసుక కుప్పలు పోసి నిల్వ ఉంచిన పంట భూములు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధిలోని పూసుకుపల్లి శివారులో ఓ కాంట్రాక్టర్ పంట భూముల్లో ఇసుక కుప్పలు పోసుకునేందుకు పంట భూములు లీజుకు తీసుకొని పోశాడు. రైతులకు కౌలు డబ్బులు ఇవ్వక రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..పూసుకుపల్లి పార్టు–2 క్వారీకి సుమారు 30 ఎకరాల పంట భూమిని రైతులు కౌలుకు ఇచ్చారు. ఎకరానికి రూ.60వేల చొప్పున కౌలుకు సదరు కాంట్రాక్టర్ తీసుకొన్నాడు. కానీ రెండేళ్లుగా క్వారీ అంతంత మాత్రంగానే నడుస్తుంది. దీంతో రైతులు తమ భూముల్లో నిల్వ ఉంచిన ఇసుక కుప్పలు ఖాళీ చేస్తే పంట వేసుకుంటామని, లేదా ఇతరులకు సాగు చేసేందుకు కౌ లుకు ఇచ్చేందుకు అవకాశం ఉందని మొరపెట్టుకున్నారు. ఇటు టీఎస్ఎండీసీ పీఓ చుట్టూ తిరిగినా పొంతన లేని సమాధానాలు చెబుతూ దాటవేస్తున్నారని అరుణ్ వాపోయాడు. తమకు న్యాయం చేయకపోతే పీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు.